




జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








ఆదివారం 03 మే 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 335 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్


## ఉద్యోగ సంఘాలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ సమస్యల పరిష్కారానికి కీలక హామీలు

### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం కీలక హామీలు నిరసనలు ఉపసంహరణ





సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 03, ప్రతినిధి: జూబ్లీహిల్స్‌లో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నేతృత్వంలో గతంలో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని గుర్తుచేసుకుంటూ వైద్య విధాన పరిషత్‌లో 13,100 మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. పీఆర్సీ, హెల్త్ కార్డుల సమస్యలతోపాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించే ప్రతి పథకాన్ని ఉద్యోగులు భుజాన వేసుకుని అమలు చేస్తున్నారని, వారి సహకారంతోనే సంక్షేమ పథకాలు విజయవంతం అవుతున్నాయని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసం మొదటి నిర్ణయం తీసుకున్నామని, ప్రతి నెలా మొదటి తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలకు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునే అవకాశం కల్పించామని, బదిలీల విషయంలో గందరగోళం లేకుండా ప్రణాళికాబద్ధంగా నిర్వహించామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న టీచర్ల బదిలీలు కూడా వివాదం లేకుండా పూర్తిచేశామని చెప్పారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డులపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, జూన్ 1లోగా అందజేస్తామని వెల్లడించారు. పీఆర్సీపై తక్షణమే నివేదిక అందించాలని అధికారుల కమిటీని ఆదేశించామని, నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గత రెండేళ్లలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టామని, 100 రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ.6 వేల కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని సూచించారు. ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళ్తున్నామని, పెన్షనర్ బకాయిలను 100 రోజుల్లో క్లియర్ చేయాలని ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అనంతరం ఉద్యోగ సంఘాల నాయకులు సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ మే 5న నిర్వహించాల్సిన నిరసన కార్యక్రమాలను ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో మారం జగదీశ్, లచ్చిరెడ్డి, ఏలూరి శ్రీనివాసరావు, జి. శ్రీనివాస్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## రాష్ట్రవ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణకు శ్రీకారం – వెంటనే పనులు ప్రారంభించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 03, ప్రతినిధి: రాష్ట్రవ్యాప్తంగా చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని అత్యవసరంగా చేపట్టాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు కట్టుదిట్టమైన ఆదేశాలు జారీ చేశారు. జల్ సౌధలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో డిసిల్టింగ్ పనులను రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ప్రారంభించాలని, కొత్త మార్గదర్శకాల కోసం ఎదురుచూడకుండా గ్రామ స్థాయి చెరువుల నుంచి పెద్ద నీటి వనరుల వరకు పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో చెరువు కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రతి చెరువుకు లేదా చెరువుల సమూహానికి రైతులు మెజారిటీగా ఉండే విధంగా కమిటీలను ఏర్పాటు చేసి వాటిని సమర్థంగా పనిచేసేలా చేయాలని ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణలో మట్టిని తొలగించడం, బండల బలోపేతం, స్లూయిస్ మరమ్మతులు, క్యాచ్‌మెంట్ అభివృద్ధి వంటి చర్యలను సమగ్రంగా చేపట్టాలని సూచించారు. అధిక తవ్వకాల ద్వారా మట్టిసారాన్ని నష్టం కలగకుండా పర్యవేక్షణ చేయాలని, డిసిల్టింగ్ పేరుతో అక్రమ తవ్వకాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. రైతులు స్వచ్ఛందంగా మట్టి తీసుకెళ్లే విధానాన్ని ప్రోత్సహిస్తూ కొత్తగా ఏర్పాటు చేసే కమిటీలకు తగిన అధికారాలు కల్పించాలని పేర్కొన్నారు. ఫుల్ ట్యాంక్ లెవల్ (FTL) నిర్ణయం, ఆక్రమణల నివారణ, క్యాచ్‌మెంట్ రక్షణ చర్యలను నీటిపారుదల, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సమన్వయంతో చేపట్టాలని తెలిపారు. తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నివేదికను ప్రశంసిస్తూ, అందులోని అమలు చేయగల సూచనలను వెంటనే అమలు చేయాలని, మిగతా సూచనలను తర్వాత దశలో పరిశీలిస్తామని మంత్రి వెల్లడించారు. జూరాల ప్రాజెక్టు సహా ఇతర ప్రాజెక్టుల్లో డిసిల్టింగ్ పనులను ఆలస్యం చేయకుండా ప్రతిపాదనలు పూర్తి చేసి వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో ఉన్నతాధికారులు, ఇంజనీర్లు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



## 2027 నాటికి కొత్త ఉస్మానియా ఆస్పత్రి సేవలు మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 03, ప్రతినిధి: గోషామహల్‌లో నిర్మాణంలో ఉన్న కొత్త ఉస్మానియా ఆస్పత్రి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, 2027 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన ఎంబీబీఎస్ 175వ స్నాతకోత్సవ కార్యక్రమంలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాతో కలిసి విద్యార్థులకు పట్టాలు అందజేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ కొత్త ఆస్పత్రిని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో, అన్ని రకాల సౌకర్యాలతో రూపొందిస్తున్నామని, రోగులు, డాక్టర్లు, సిబ్బందికి అనుకూలంగా డిజైన్ చేస్తున్నామని చెప్పారు. ప్రజల బాధను పంచుకునే పవిత్ర వృత్తిలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు మానవత్వంతో సేవ చేయాలని, ధనార్జనే లక్ష్యంగా కాకూడదని సూచించారు. దశాబ్దాలుగా ఉన్న కొత్త ఉస్మానియా ఆస్పత్రి కలను తమ ప్రభుత్వం సాకారం చేస్తున్నదని, త్వరలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఉస్మానియా ఆస్పత్రి రోజూ వేలాది రోగులకు సేవలందిస్తోందని, ఇటీవల చిన్నారికి విజయవంతంగా లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం వైద్యుల ప్రతిభకు నిదర్శనమని పేర్కొన్నారు. అదేవిధంగా గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో విద్యార్థుల కోసం ఆధునిక హాస్టల్ భవనాల నిర్మాణం చేపట్టామని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.



## ప్రభుత్వానికి కళ్లు, చెవులు విప్‌లే – ప్రజా సమస్యల పరిష్కారంలో చురుకుగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 03, ప్రతినిధి: రాష్ట్రంలో ప్రజా సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించడంలో విప్‌ల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ కేంద్రంలో శాసనసభ, శాసనమండలి విప్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విప్‌లు ప్రభుత్వానికి కళ్లు, చెవులుగా వ్యవహరించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో నియోజకవర్గాల్లో తాగునీరు, సాగునీటి అవసరాలు, ధాన్యం సేకరణ పురోగతి వంటి అంశాలను విప్‌లు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ధాన్యం సేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. విప్‌లు ప్రజల్లో ఉండి సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లి ప్రజల్లో నమ్మకం పెంచాలని, సమస్యలను తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రతి వారం ఒక రోజు విప్‌లతో సమావేశమై ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహిస్తానని సీఎం వెల్లడించారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, యెన్నం శ్రీనివాస్ రెడ్డి, విజయరమణరావు, రామచంద్రు నాయక్, వేముల వీరేశం, అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని సభను జయప్రదం చేయాలి – రూ.7,823 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

సందేశం టైమ్స్, తెలంగాణ బ్యూరో, మే 03, ప్రతినిధి: మే 10న ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు పిలుపునిచ్చారు. మెదక్ జిల్లా రామాయంపేట్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తెలంగాణకు ప్రధాని రావడం ఇదే తొలిసారి అని తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రంలో సుమారు రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారని పేర్కొన్నారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ సిటీ, వరంగల్ టెక్స్టైల్ పార్క్, పీఎం మిత్ర హ్యాండ్లూమ్ పార్క్, హఫీజ్‌పేట్, జోగులాంబ ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారుల అభివృద్ధి వంటి పలు ప్రాజెక్టులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. భవిష్యత్తులో వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ, ఎయిర్‌పోర్ట్ వంటి ప్రాజెక్టులు కూడా అమలులోకి వస్తాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శిస్తూ 2015 నుంచి పీఆర్సీ బకాయిలు పెండింగ్‌లోనే ఉన్నాయని, రిటైర్డ్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నెల మొదటి తేదీకి జీతాలు అందకపోవడం, టీచర్ల వేతనాల ఆలస్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్న హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. రైతులు ధాన్యం విక్రయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొనుగోలు కేంద్రాల్లో ఆలస్యం, మధ్యవర్తుల దోపిడీ వల్ల నష్టపోతున్నారని ఆరోపించారు. కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే తక్కువ ధరకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి దురదృష్టకరమని, ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

## బతుకమ్మ కుంట పునరుద్ధరణలో హైకోర్టు ఉత్తర్వుల మేరకే చర్యలు – హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం

సందేశం టైమ్స్, తెలంగాణ బ్యూరో, మే 03, ప్రతినిధి: బతుకమ్మ కుంట చెరువు పునరుద్ధరణ విషయంలో హైకోర్టు ఉత్తర్వులను పాటిస్తూ ముందుకు సాగుతున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. బతుకమ్మ కుంటలో చెరువు లేదంటూ ఎడ్ల సుధాకర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల ప్రకారం అక్కడ సుమారు 10 ఎకరాల చెరువు ఉన్నట్లు వెల్లడించారు. వరదల నివారణకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ అనుమతి ఇచ్చిందని, అదే ప్రకారం చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. హైడ్రా పేదల ఇళ్లనే కూల్చేస్తూ పెద్దలను వదిలేస్తుందన్న ఆరోపణలను ఖండిస్తూ చట్టప్రకారమే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో చెరువులను ఆక్రమించి నిర్మించిన ఇళ్లు, అపార్టుమెంట్లను కూల్చివేసి చెరువులను పరిరక్షించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఆ చర్యల వల్ల కొన్ని కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రజల భద్రత, వరద నివారణ కోసమే ఈ నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. పుకార్లను నమ్మవద్దని ప్రజలను కోరుతూ చెరువుల పరిరక్షణలో ప్రభుత్వం కట్టుబడి ఉందని కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో ప్రజల్లో అవగాహన కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్





సందేశం టైమ్స్, కోదాడ, మే 03, ప్రతినిధి: సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఆర్ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ లక్ష్యాలతో భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ఈ కార్యక్రమం ప్రజల్లో అవగాహన పెంచే దిశగా రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. పరిసరాల పరిశుభ్రత, ప్రజా సంక్షేమ చర్యలపై ప్రజలకు చైతన్యం కల్పిస్తూ, అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాల లబ్ధిని పొందేలా అధికారుల ద్వారా గ్రామ, పట్టణ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. యువత మాదకద్రవ్యాల బారిన పడి అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, గ్రామ పెద్దలు, ప్రజలు గంజాయి వంటి మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులకు సహకరించాలని కోరారు. అనంతరం పలు మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను సన్మానించి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఆర్డీఓ సిహెచ్ సూర్యనారాయణ, గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, ఎంఈఓ సలీం షరీఫ్, చైర్మన్ కుసుమా బాబు, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, మార్కెట్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్నాక్స్ అందించి మానవత్వం చాటిన సామాజిక కార్యకర్త భద్రారెడ్డి



సందేశం టైమ్స్, కోదాడ, మే 03, ప్రతినిధి: కోదాడ పట్టణంలోని బాలుర పాఠశాలలో శాంతినగర్‌కు చెందిన సామాజిక కార్యకర్త భద్రారెడ్డి తన మానవత్వాన్ని చాటుకున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేసే సమయంలో వారికి స్నాక్స్ అందిస్తూ, అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సహకారంపై పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భద్రారెడ్డి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యార్థులకు ఇలాంటి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు.

# ఎస్ఎస్‌సి లో 567 మార్కులతో పూజశ్రీ ప్రతిభ కోదాడలో ఘన సన్మానం



సందేశం టైమ్స్, కోదాడ, మే 03, ప్రతినిధి: కోదాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని కట్టేకోలా పూజశ్రీ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సి పరీక్షల్లో 567 మార్కులు సాధించి పాఠశాల స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల భాగంగా కోదాడ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సమావేశంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించగా, పూజశ్రీకి ప్రత్యేక గౌరవ సన్మానం అందజేశారు. ఈ సన్మానం సూర్యపేట జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా, ఆర్డీవో ఆధ్వర్యంలో మరియు ఎంఈఓ కోదాడ నాయకత్వంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల తరపున విప్పర్ల శ్రీనివాస్ (స్కూల్ అసిస్టెంట్ – హిందీ) హాజరై విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు పూజశ్రీ ప్రతిభను ప్రశంసించారు.

# ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫీజు గడువు పొడిగింపు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 03, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి కార్యాలయం నుంచి విడుదలైన ప్రకటన ప్రకారం మే 2026లో నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువును పొడిగించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సర రెగ్యులర్ విద్యార్థులు, అలాగే జనరల్, వృత్తి విద్య విభాగాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు రూ.3,000 ఆలస్య రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించేందుకు మే 02 నుండి మే 04 సాయంత్రం 5 గంటల వరకు గడువు నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులు నిర్ణీత గడువులో ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని అధికారికంగా సూచించారు.

# హార్వెస్టర్ మిషన్‌కు లోన్ మంజూరు రైతులకు ఊతమిస్తున్న గ్రామీణ బ్యాంకు



సందేశం టైమ్స్, చింతకాని, మే 03, ప్రతినిధి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు నాగులవంచ సిబ్బంది హార్వెస్టర్ మిషన్ కొనుగోలుకు లోన్ మంజూరు చేసి రైతులకు ఊతమిచ్చారు. చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామానికి చెందిన రావట్ల వెంకటేశ్వర్లు గోదాప్రసాద్ నూతన వరి కోత మిషన్‌ను కొనుగోలు చేయగా, ఏజీఎం ప్రసన్న కుమార్ కొబ్బరికాయ కొట్టి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో యంత్రాల పాత్ర కీలకమైందని, వరి కోత యంత్రాలు రైతులకు వరంగా మారాయని తెలిపారు. ఒక ఎకరం వరి పంటను చేతిపనితో కోయాలంటే సుమారు ఐదు రోజుల సమయం, 30 మంది కూలీలు అవసరమవుతారని, కానీ యంత్రాల వినియోగంతో గంటలోనే ఒక ఎకరం పంట కోసి ఇంటికి తీసుకురావచ్చని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎంబి సురెడ్డి, ఏఎంహెచ్ రాపర్తి, నగర్ మేనేజర్ రవికాంత్, బ్యాంకు మేనేజర్ నాగ సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ గీతాంజలి కరణ, గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, బండి సైదులు, మడిపల్లి రామకృష్ణ, గోగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతం కలెక్టర్ ప్రతిమా సింగ్





సందేశం టైమ్స్, మెదక్, మే 03, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జిల్లాలో దిగ్విజయంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజు, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ లావణ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు దొంతి నరేష్ గౌడ్, నబితా, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ముందుగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి గ్రామీణ ప్రాంతాల వరకు ఈ కార్యక్రమాలను సమగ్రంగా అమలు చేస్తున్నామని తెలిపారు. వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లకు కార్యక్రమంపై అవగాహన కల్పించామని, ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో గ్రామ సభలు నిర్వహించి శాఖల వారీగా కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు. హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ వైద్య పరీక్షలు చేస్తున్నామని, పోలీసు శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామస్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో రైతు వారం, సంక్షేమ వారోత్సవాలు, చైల్డ్ సేఫ్టీ, నో డ్రగ్స్, వ్యవసాయం, యువజన సేవలు, విద్య, మహిళలు, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు వ్యవసాయం, ఉద్యానవనం, ఇందిరమ్మ ఇండ్లు, వైద్య, మెప్మా, విద్యుత్, ఇందిరా మహిళా శక్తి, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, నూతన రేషన్ కార్డులు, పోలీస్ ప్రమాదాల నివారణ వంటి అంశాలపై వివిధ శాఖల జిల్లా అధికారులు సమగ్ర కార్యాచరణను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఉత్తీర్ణులకు శాలువాలతో సన్మానం బండారి గంగాధర్ అభినందనలు



సందేశం టైమ్స్, మెదక్, మే 03, ప్రతినిధి: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలోని శివంపేట్ మండల పిల్లుట్ల గ్రామంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను కాంగ్రెస్ నాయకుడు, జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బండారి తులసి 546 మార్కులు (9.0 గ్రేడ్), సండ్ర అభినవ్ 506 మార్కులు (9.0 గ్రేడ్) సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ గ్రామానికి, పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చిన విద్యార్థుల ప్రతిభ అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు చదువును ఆయుధంగా తీసుకుని మరింత ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలు సాధించాలని, అవసరమైతే ఎలాంటి సంకోచం లేకుండా సహాయం కోరాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, జాతీయ మానవ హక్కుల కమిటీ అధ్యక్షుడు సండ్ర సుదర్శనం, కుమ్మరి నాగరాజు, బుర్ర పోచ గౌడ్, బుర్ర మహేష్ గౌడ్, పిల్లి నరసింహులు, పిల్లి కిష్టయ్య, పిల్లి స్వాములు, బోను లింగం, బండారి గోపి, రంగప్ప, బాలరాజు, కొత్తపల్లి నాగరాజు, దాసరి పోచయ్య, దాసరి బాలయ్య, అల్లిపూర్ బాలేష్, పిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీలకు ఉచిత సేవలు అందిస్తున్న లతీఫ్‌కు నామ నాగేశ్వరరావు ప్రశంసలు



సందేశం టైమ్స్, వైరా, మే 03, ప్రతినిధి: గర్భిణీ స్త్రీలను పరీక్షల కోసం, డెలివరీ సమయాల్లో ఉచితంగా తన ఆటోలో ఆసుపత్రికి తరలిస్తూ సేవలు అందిస్తున్న లతీఫ్‌ను బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు అభినందించారు. మారుమూల గ్రామాల్లో బస్సు సౌకర్యం లేని ప్రాంతాల్లో ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని నామ పేర్కొన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిన సమయంలో కూడా ఖర్చును పట్టించుకోకుండా, తన పంక్చర్ షాప్‌ను నిర్వహిస్తూ అవసరమైన వేళల్లో సేవలు అందించడం స్ఫూర్తిదాయకమని తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా నామ స్ఫూర్తితోనే ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు లతీఫ్ వెల్లడించారు. నామ ట్రస్ట్ ద్వారా వైరా పట్టణం, రూరల్ మండలానికి చెందిన ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు అందించడం, నామ తండ్రి ముత్తయ్య పేరుతో గ్రామాల్లో నీటి సరఫరా, బోర్లు వేయించడం, ఆరోగ్య సేవలు అందించడం వంటి కార్యక్రమాలను ఆయన గుర్తు చేసుకున్నారు. అలాగే 17వ లోక్‌సభ కాలంలో నామ నిధులతో వైరాకు అందించిన అంబులెన్స్ అత్యవసర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతోందని, కోవిడ్ సమయంలో కూడా తాను తన ఆటోతో సేవలు అందించానని తెలిపారు. వైరా మండలం పరిసర గ్రామాలైన స్టేజి పినపాక, సిరిపురం, కే.జి. సిరిపురం, పూసలపాడు, గౌండ్లపాలెం, నారపనేనిపల్లి, విప్పలమడక, లింగనపాలెం, గరికపాడు, దాచాపురం, సన్నాల లక్ష్మీపురం, ముసలిమడుగు, పుణ్యాపురం, పాత పినపాక తదితర గ్రామాల నుంచి గర్భిణీలను 24 గంటలు ఉచితంగా ఆసుపత్రికి తరలిస్తున్నానని లతీఫ్ తెలిపారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ లతీఫ్ వంటి సేవాభావం కలిగిన వ్యక్తులు సమాజంలో మరింత పెరగాలని, ఆయన సేవలు మరింత విస్తరించి మరెందరికో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.

# వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం – రైతులకు మద్దతు ధరతో విక్రయించాలని సూచన



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మే 03, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని బిజిలిపూర్, కదిరాబాద్ గ్రామాలలో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాలను వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,389 మద్దతు ధరను, సాధారణ రకానికి రూ. 2,369 ధరను నిర్ణయించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు అవసరమైన ధ్రువపత్రాలు, నియమ నిబంధనలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సర్పంచ్ ఇందిర, సీసీలు నిరంజన్, జనార్ధన్, వివోఏలు శశికళ, మాజీ ఎంపీటీసీ సంఘప్ప, వార్డ్ మెంబర్ రాజన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, శ్రీశైలం, కుమార్, సంగమేష్, కృష్ణ, గ్రామ సంఘం అధ్యక్షులు మోగులమ్మ, సునీత తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంపై అవగాహన ప్రతి లబ్ధిదారుడు సద్వినియోగం చేసుకోవాలి



సందేశం టైమ్స్, అనంతగిరి, మే 03, ప్రతినిధి: అనంతగిరి మండలంలోని వాయిలసింగవరం గ్రామంలో ఉపాధి హామీ పథకం మేట్లు, కూలీలకు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలవుతున్న ఈ పథకం ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రతి కుటుంబానికి 125 రోజుల పాటు పని కల్పించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం కూలీలకు రోజుకు రూ.307 వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల జాబితా సిద్ధమైందని, సోమవారం నుంచి పనులు ప్రారంభమవుతాయని, పని కోసం దరఖాస్తు చేసిన ప్రతి గ్రూపుకు పనులు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం 6 గంటల నుంచి పనులు ప్రారంభించి 10 గంటలలోపు ముగించాలని మేట్లు, కూలీలకు సూచించారు. పనుల వద్ద ఫోటో హాజరు విధానం అమలు చేయనున్నందున ప్రతి 50 మంది కూలీలకు ఒక మొబైల్ ఆపరేటింగ్ తెలిసిన వ్యక్తిని నియమించుకోవాలని సూచించారు. అలాగే కూలీలు వ్యవసాయ కార్మిక సంఘంలో చేరి ప్రతివ్యక్తి రూ.10 చెల్లించి సభ్యత్వం పొందాలని కోరారు. పనుల ప్రదేశాల్లో గ్రామ పంచాయతీ తరఫున నీడ, మంచినీటి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేట్ల సంఘం నాయకులు కొల్లు సుబ్బారావు, గడ్డం వీరబాబు, బుర్రా వీరబాబు, చింతకాయల నాగేంద్ర, బాదరబోయిన నాగేంద్ర, నేరెళ్ళ నర్సయ్య, మేళ్లచెర్వు గురవయ్య, గాదె వీరభద్రం తదితరులు, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలపై కఠిన చర్యలు – టాస్క్‌ఫోర్స్ తనిఖీలు ప్రారంభం






సందేశం టైమ్స్, మెదక్, మే 03, ప్రతినిధి: మెదక్ జిల్లాను నకిలీ విత్తనాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై టాస్క్‌ఫోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు ప్రారంభించి, పీడీ చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వానాకాలం 2026 పంటల దృష్ట్యా విత్తనాలు, ఎరువుల కన్వర్జెన్స్ సమావేశాన్ని వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల సమన్వయంతో నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, నర్సాపూర్ ఆర్డీఓ రామకృష్ణ, డీఎస్పీలు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటూ, పత్తి, వరి పంటల్లో నకిలీ విత్తనాల సమస్య అధికంగా ఉండటంతో సీజన్ మొత్తం కఠిన తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో జిల్లా స్థాయి ఒకటి, డివిజన్ స్థాయి మూడు, మండల స్థాయి 21 టాస్క్‌ఫోర్స్ బృందాలు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 334 రిటైల్ విత్తన దుకాణాలు, 41 విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, 334 లైసెన్సు హోల్డర్లు ఉన్నారని తెలిపారు. నకిలీ విత్తనాలుగా లైసెన్సు లేని సంస్థలు తయారు చేసినవి, సరైన లేబులింగ్ లేని ప్యాకెట్లు, గడువు ముగిసినవి గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వానాకాలంలో సుమారు 3.26 లక్షల ఎకరాల్లో సాగు అంచనా వేస్తూ, అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందుగానే సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, లూజ్ విత్తనాలు కొనవద్దని సూచించారు. అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలపై చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ అకుల్ కుమార్ జైన్, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సే లక్ష్యం – కొనుగోలు కేంద్రాల్లో జాప్యం లేకుండా సేవలు అందించాలి



సందేశం టైమ్స్, మెదక్, మే 03, ప్రతినిధి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని రాయలపూర్ గ్రామంలో ఉన్న పాక్స్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి టోకెన్ల జారీ, తూకం, తేమ పరీక్షలు సరైన విధంగా వేగంగా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. ధాన్యం బస్తాల లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగంగా పూర్తయ్యేలా తగిన హమాలీలు, వాహనాలు ఏర్పాటు చేసి సకాలంలో మిల్లులకు తరలించాలని, రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు ధాన్యం కొనుగోలు వివరాలను వెంటనే ట్యాబ్‌లో నమోదు చేసి 48 గంటలలోపు చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక వసతులు కల్పించి వడదెబ్బ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాల్సిందిగా స్పష్టం చేశారు. ఈ తనిఖీలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వికలాంగుల సమస్యలపై నిర్లక్ష్యం ఐకేపీ అధికారులపై విమర్శలు



సందేశం టైమ్స్, మెదక్, మే 03, ప్రతినిధి: రాష్ట్రంలో వికలాంగుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ఎన్ని ప్రభుత్వాలు మారినా వారి పరిస్థితిలో మార్పు రావడం లేదని ఎన్‌పీఆర్‌డీ ఇండియా నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు ఇస్మాయిల్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వికలాంగుల సంఘాలు మండల, జిల్లా స్థాయిలో చురుకుగా పనిచేసేవని, కానీ సిబ్బంది తొలగింపుతో అవి నిర్వీర్యమయ్యాయని తెలిపారు. వాటిని మళ్లీ పునరుద్ధరించి సక్రమంగా నడిచేలా చూడాలని ఐకేపీ అధికారులను డిమాండ్ చేశారు. మండల వికలాంగుల సమైక్యకు ప్రభుత్వం ఇచ్చిన రూ.10 లక్షల సీఏఎఫ్ నిధులను శ్రీనిధిలో డిపాజిట్ చేసినప్పటికీ, ఆ వడ్డీ లాభాలు వికలాంగుల సంఘాలకు అందడం లేదని ఆరోపించారు. జిన్నారం ప్రాంతంలో గతంలో ఏర్పాటు చేసిన వికలాంగుల సంఘాలకు రుణాల పంపిణీ సక్రమంగా జరగలేదని పేర్కొన్నారు. వికలాంగుల సంక్షేమానికి సంబంధించి తక్షణ చర్యలు తీసుకుని వారికి అవసరమైన మద్దతు అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం ఒక్క రోజులో రూ.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



సందేశం టైమ్స్, సూర్యాపేట, మే 03, ప్రతినిధి: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని, ప్రతి కొనుగోలు కేంద్రంలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒక్క రోజులోనే రూ.44 కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేయబడినట్లు వెల్లడించగా, ఇప్పటివరకు మొత్తం రూ.115 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తూకం వేసి వెంటనే కొనుగోలు చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీలు, తూకం యంత్రాలు, రవాణా సౌకర్యాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచినట్లు, రైతులకు తాగునీరు, నీడ, విశ్రాంతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం విక్రయంలో మధ్యవర్తుల పాత్ర లేకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యం తీసుకురావాలని సూచిస్తూ, ఎక్కడైనా అవకతవకలు గమనించినట్లయితే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, రైతులకు న్యాయమైన ధర అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

## డివిజన్ ఫస్ట్ సాధించిన హరి, విన్ని కోదాడలో ఘన సన్మానం



సందేశం టైమ్స్, కోదాడ, మే 03, ప్రతినిధి: కోదాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బలుసుపాటి హరి 572 మార్కులు, చిల్లంచర్ల విన్ని 565 మార్కులు సాధించి 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సి పరీక్షల్లో డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల భాగంగా కోదాడ నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సమావేశంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం నిర్వహించగా, హరి, విన్ని లకు ప్రత్యేక గౌరవ సన్మానం అందజేశారు. ఈ సన్మానం సూర్యపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ చేతుల మీదుగా, ఆర్డీఓ సూర్యనారాయణ ఆధ్వర్యంలో మరియు ఎంఈఓ కోదాడ సలీం షరీఫ్ నాయకత్వంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల తరపున ఇంచార్జ్ హెచ్ఎం మార్కండేయతో పాటు ఇతర ఉపాధ్యాయులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు హరి, విన్ని ల ప్రతిభను ప్రశంసించారు.

## బాల హక్కుల దర్శిని 'రక్షా బాట' పర్యటన ముగింపు చైల్డ్ సేఫ్టీపై విస్తృత అవగాహన




సందేశం టైమ్స్, మెదక్, మే 03, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా చైల్డ్ సేఫ్టీ, ప్రొటెక్షన్ – "సే నో టు డ్రగ్స్" వారోత్సవాల సందర్భంగా మెదక్ జిల్లా పరిపాలన విభాగం, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల హక్కుల దర్శిని 'రక్షా బాట' అవగాహన పర్యటన వారం రోజులపాటు విజయవంతంగా సాగి ముగింపు కార్యక్రమంతో ముగిసింది. ఈ పర్యటన ద్వారా బాలల హక్కులు, భద్రత, ఆరోగ్యం, సంరక్షణతో పాటు ప్రభుత్వ సేవలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పించబడింది. ముఖ్యంగా గుడ్ టచ్-బ్యాడ్ టచ్, సైబర్ సేఫ్టీ, డ్రగ్స్ నివారణ వంటి అంశాలపై ప్రత్యేక సందేశాలు అందించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, మహిళా సంఘాలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, కమ్యూనిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పొందారు. ఈ సందర్భంగా "డ్రగ్స్‌కు NO – జీవితానికి YES" అనే అవగాహన గీతాన్ని విడుదల చేసి యువతలో సానుకూల మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రతి చిన్నారి రక్షణ సమాజం మొత్తం బాధ్యతగా భావించి, డ్రగ్స్ వంటి ప్రమాదాల నుంచి యువతను దూరంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని అధికారులు కోరారు. జిల్లా మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.

## వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభం – మద్దతు ధరతో విక్రయించాలని రైతులకు సూచన



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మే 03, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల పరిధిలోని బిజిలిపూర్, కదిరాబాద్ గ్రామాల్లో ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాలను వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తమ వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.2,389 మద్దతు ధరను, సాధారణ రకానికి రూ.2,369 ధరను నిర్ణయించిందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించేందుకు అవసరమైన ధ్రువపత్రాలు, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సర్పంచ్ ఇందిర, సీసీలు నిరంజన్, జనార్ధన్, వివోఏలు శశికళ, మాజీ ఎంపీటీసీ సంఘప్ప, వార్డ్ మెంబర్ రాజన్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, శ్రీశైలం, కుమార్, సంగమేష్, కృష్ణ, గ్రామ సంఘం అధ్యక్షులు మోగులమ్మ, సునీత తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం – నిర్మల జగ్గారెడ్డి



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 03, ప్రతినిధి: అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డును కూడా మంజూరు చేయలేదని విమర్శిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదలందరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళలను ఆర్థికంగా బలపరచి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేందుకు ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు రూ.195.18 కోట్ల విలువైన బ్యాంకు రుణాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీవో జ్యోతి, ఆర్డీవో రాజేందర్, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్మన్లు కూన వనిత, అంజమ్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయక్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస్ రెడ్డి, శివాజీ తదితర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



## ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య, విద్యా సేవలే లక్ష్యం మంత్రి దామోదర్ రాజనర్సింహ

సందేశం టైమ్స్, అందోల్, మే 03, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ఆందోల్–జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆరోగ్య సమస్యల కారణంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని, జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందేలా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు, సైబర్ మోసాలపై అప్రమత్తం కావాలి – యువతకు హెచ్చరిక





సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 03, ప్రతినిధి: మాదక ద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ నేరాలు యువత భవిష్యత్‌ను దెబ్బతీస్తున్నాయని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఐపీఎస్ హెచ్చరించారు. సంగారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత, బాలల రక్షణకు పోలీసులు ప్రాధాన్యత ఇస్తున్నారని, షీ టీమ్స్, సఖీ, భరోసా కేంద్రాలు బాధితులకు అండగా నిలుస్తున్నాయని తెలిపారు. సైబర్ మోసాల్లో "డిజిటల్ అరెస్ట్" వంటి పద్ధతులు అసత్యమని, అనుమానాస్పద కాల్స్, పెట్టుబడి ఆఫర్లకు లోనవ్వవద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100, 112, 1930, 1098 నంబర్లకు లేదా షీ టీమ్‌కు సమాచారం అందించాలని, సైబర్ నేరాల్లో తొలి గంట అత్యంత కీలకమని పేర్కొన్నారు. యువత చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.



## పటాన్చెరు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన జర్నలిస్టులు

సందేశం టైమ్స్, పటాన్చెరు, మే 03, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గ ఎమ్మెల్యేను ఆయన క్యాంప్ కార్యాలయంలో జర్నలిస్టులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా చార్మినార్, ఎక్స్‌ప్రెస్ చీఫ్ బ్యూరో షేక్ మహబూబ్, ప్రజాజ్యోతి రిపోర్టర్ మహిపాల్, హమారా చార్మినార్ సంగారెడ్డి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎస్. రవీందర్, మైనార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ షకీల్, అమీన్పూర్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఇనుస్, మహ్మద్ మోహిన్ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో వివిధ అంశాలపై చర్చిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై అప్రమత్తం కావాలి నాగల్గిద్దిలో అవగాహన కార్యక్రమం




సందేశం టైమ్స్, నాగల్గిద్ది, మే 03, ప్రతినిధి: ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సంగారెడ్డి జిల్లా షీ టీమ్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నాగల్గిద్ది మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు మహిళల భద్రత, బాలల రక్షణ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో షీ టీమ్ ఎస్ఐ పూలభాయ్ మాట్లాడుతూ మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్ నిరంతరం సేవలు అందిస్తున్నదని తెలిపారు. లింగ వివక్ష, లైంగిక వేధింపులు, బాలల రక్షణ చట్టాలు, మహిళల హక్కులపై అవగాహన కల్పిస్తూ సైబర్ మోసాలు, ఫేక్ అకౌంట్లు, సోషల్ మీడియా దుర్వినియోగంపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే పోలీసులను సంప్రదించాలని, అత్యవసర సమయంలో 100, 112, 1930, 1098 లేదా షీ టీమ్ నంబర్ 8712656772ను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు అధికారులు, షీ టీమ్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## ఘనంగా అలేఖ్య పుట్టినరోజు వేడుకలు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 03, ప్రతినిధి: సంగారెడ్డి సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సంగమేశ్వర్ కుమార్తె అలేఖ్య పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం పూర్తిచేసుకుని రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అలేఖ్యతో కేక్ కట్ చేయించి ఆనందంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర్, ఆయన తల్లి పూలమ్మ, అక్క అక్షితతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## దూదగోండలో పోలేరమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా పాల్గొన కాంగ్రెస్ నాయకుల



సందేశం టైమ్స్, మనూర్, మే 03, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూర్ మండల పరిధిలో దూదగోండ గ్రామంలో పోలేరమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో తోర్నల్ గ్రామ సర్పంచ్ సంగమేష్ పటేల్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనాపురం చంద్రశేఖర్, మనూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుభాష్ రావు పటేల్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాలిపటేల్ శివకాంత్ శాలువాలతో ఘనంగా సన్మానించగా, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.



## నీట్ యూజీ–2026 పరీక్ష: రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మే 03, ప్రతినిధి: దేశవ్యాప్తంగా వైద్య ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ యూజీ–2026 పరీక్ష ఈరోజు (ఆదివారం) జరుగుతోంది. తెలంగాణలో 73,084 మంది అభ్యర్థుల కోసం 24 జిల్లాల్లో 199 పరీక్ష కేంద్రాలతో పకడ్బందీ ఏర్పాట్లు పూర్తయ్యాయి. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుంది. ఎన్‌టీఏ, రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ వెరిఫికేషన్, జామర్లు, డ్యూయల్ లేయర్ ఫ్రిస్కింగ్ వంటి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేస్తున్నారు. పెన్ అండ్ పేపర్ విధానంలో 180 ప్రశ్నలకు 720 మార్కుల పరీక్ష నిర్వహించగా, సరైన జవాబుకు 4 మార్కులు, తప్పు జవాబుకు 1 మార్క్ నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని, పారదర్శకమైన వాటర్ బాటిల్‌తో పాటు తప్పనిసరిగా అడ్మిట్ కార్డు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. మహిళా అభ్యర్థులకు కేంద్రాల కేటాయింపులో ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. పరీక్షను పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీల పర్యవేక్షణ కొనసాగుతోంది.

## అందరికీ నాణ్యమైన విద్య, ఉచిత సమగ్ర వైద్యం లక్ష్యం – మంత్రి దామోదర్ రాజనర్సింహ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మే 03, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఆందోల్ నియోజకవర్గ స్థాయి సమావేశం జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్యతో పాటు సమగ్ర వైద్య సేవలను ఉచితంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యల వల్ల ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని సేవలు అందిస్తున్నామని, జిల్లా స్థాయిలోనే 90 శాతం వైద్య సేవలు అందేలా ఆధునిక సదుపాయాలను విస్తరిస్తున్నామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సేవలందించేందుకు ట్రామా, ఎమర్జెన్సీ సేవలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. మహిళల సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాల పథకాలను అమలు చేసి, ప్రస్తుతం ఇందిరమ్మ క్యాంటీన్లు, సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులు వంటి అవకాశాలను మహిళలకు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రతి పాఠశాల, కళాశాలలో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం, మౌలిక వసతులు అందిస్తున్నామని, అందోల్ ప్రాంతంలో త్వరలో ఫార్మసీ కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే రూ.200 కోట్ల వ్యయంతో సింగూర్ లైన్ పనులు చేపట్టి, ఆ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రణాళిక రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో జిల్లా అభివృద్ధి చెందుతోందని వివరించగా, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగు విస్తరణపై రైతులకు అవగాహన సదస్సు

సందేశం టైమ్స్, జిల్లా, మే 03, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో ఉద్యాన పంటల సాగు, ఆయిల్ పామ్ సాగు విస్తరణ, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల రైతులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, సర్పంచులు, ఆత్మ కమిటీ చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తదితరులు పాల్గొననున్నారు. జిల్లాలో ప్రస్తుతం వరి, పత్తి, మొక్కజొన్న పంటల సాగు అధికంగా జరుగుతుండగా పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయల సాగు తక్కువగా ఉందని అధికారులు పేర్కొంటూ వినియోగ అవసరాల పరంగా చూస్తే పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయల ఉత్పత్తి తక్కువగా ఉండటంతో దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోందని, అదే సమయంలో బియ్యం ఉత్పత్తి అవసరానికి మించిన స్థాయిలో జరుగుతోందని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, భూసార క్షీణత, చీడపీడలు, పెరుగుతున్న పెట్టుబడులు, గిట్టుబాటు ధర లేకపోవడం వంటి కారణాలతో రైతులకు అనుకున్న లాభాలు రావడం లేదని పేర్కొంటూ ఈ పరిస్థితుల్లో ఏకపంట విధానం నుండి బహుళ పంటల సాగు వైపు మారాల్సిన అవసరం ఉందని అధికారులు స్పష్టం చేశారు. ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూలు, సుగంధ ద్రవ్యాలు, అలాగే ఆయిల్ పామ్ సాగు వంటి ప్రత్యామ్నాయ పంటలు రైతులకు అధిక ఆదాయం అందించగలవని చెబుతూ ప్రభుత్వం కూరగాయల విత్తనాలు, నారు, మల్చింగ్, డ్రిప్, షెడ్ నెట్ వంటి వాటికి రాయితీలు అందిస్తోందని, అలాగే పూల తోటలు, అల్లం, పసుపు వంటి పంటలకు కూడా ప్రోత్సాహకాలు ఇస్తోందని తెలిపారు. దేశంలో వంట నూనె దిగుమతులు తగ్గించి స్వయం సమృద్ధి సాధించేందుకు ఆయిల్ పామ్ సాగును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రోత్సహిస్తున్నదని పేర్కొంటూ రైతులు ఈ అవకాశాలను వినియోగించుకుని ప్రత్యామ్నాయ పంటల వైపు ముందుకు రావాలని అధికారులు సూచించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.